క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయ పంటలకు పెరిగిన గిరాకీ



పోటీపడి కూరగాయలు కొనుక్కుంటున్న వినియోగదారులు

నగరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రతి సోమవారం విక్రయించే ప్రకృతి వ్యవసాయ పంటలకు గిరాకీ పెరిగింది. మండలంలో వివిధ ప్రాంతాల నుంచి కూరగాయలు తెచ్చే రైతుల వద్ద నుంచి కొనుగోలుదారులు పోటీపడి మరీ కొనుగోలు చేసుకున్నారు. రైతులు కూరగాయలు అమ్మకాలకు ఉంచిన గంట సేపటిలో అన్నీ అమ్ముడైపోయాయి. అమ్మకాలు బాగా ఉన్నందున రానున్న కాలంలో మరిన్ని కూరగాయలు అమ్మకాలకు తీసుకొస్తామని రైతులు తెలిపారు.

డివిజన్ కార్యాలయం తనిఖీ



డివిజన్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, ఈఈ మునిచంద్ర

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక గాంధీరోడ్డులోని ట్రాన్స్‌కో డివిజన్ కార్యాలయాన్ని ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ సోమవారం పరిశీలించారు. ప్రహరీలోని అన్ని కార్యాలయాలను తనిఖీ చేశారు. త్వరలో రూరల్-3 డీఈ కార్యాలయం రెడ్డిగుంటకు మారనుంది. అక్కడ ఏ కార్యాలయం కేటాయించాలని అధికారులతో మాట్లాడారు. శిథిలావస్థకు చేరిన ఈఆర్వో కార్యాలయాన్ని కొత్తగా నిర్మిస్తే అంతవరకు బిల్లింగ్ కౌంటర్, సిబ్బంది ఎక్కడ ఉండాలని అధికారులతో సమాలోచన చేశారు. మొత్తం డివిజన్ కార్యాలయంలో ఉన్న గదులు అక్కడ ఉన్న విభాగాల వివరాల గురించి ఈఈ మునిచంద్ర తెలియజేశారు. ఏ గదులను ఎవరికి కేటాయించాలో నిర్ణయించనున్నట్లు ఎస్ఈ పేర్కొన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ ఈఈ జగదీష్, డీఈలు ప్రసాద్, ఆనంద్, ఏఏఓ గీత, జేఏఓ గోవిందరాజులు పాల్గొన్నారు.

దివ్యాంగుల జాబితా విడుదల చేయాలి



వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్: స్పెషల్ ఎడ్యుకేషన్, దివ్యాంగుల (ప్రత్యేక ప్రతిభావంతు) సీనియారిటీ జాబితాలను విడుదల చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ కోరారు. ఈ మేరకు సోమవారం ఆ సంఘం నాయకులు డీఈవో వరలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ సబ్జెక్టుకు అర్హత ఉన్న సెకండరీ గ్రేడ్ టీచర్లు జిల్లాలో ఉన్నారని చెప్పారు. వారికి సంబంధించిన సీనియారిటీ జాబితాను విడుదల చేయాలని కోరారు. వివిధ సబ్జెక్టుల్లో ప్రత్యేక ప్రతిభావంతుల ఉద్యోగోన్నతులకు కేటాయించిన పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్‌నాయుడు, మణిగండన్ మాట్లాడుతూ డీఎస్సీ 2002లో ల్యాంగ్వేజ్ పండింట్ హిందీలుగా ఎంపికైన 19 మంది, 2005, 2006లో నియామకం పొందిన వారికి డీఎస్సీ 2002 టీచర్లతో సమానంగా నోషనల్ సీనియారిటీని కోర్టు ఉత్తర్వులను అనుగుణంగా కల్పించాలన్నారు. అనంతరం పలు డిమాండ్లపై డీఈవోతో చర్చించారు.

చికెన్‌పై అపోహలు వద్దు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చికెన్, కోడిగుడ్లపై అపోహలు వద్దని జేసీ విద్యాధరి పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని ఓ ఫ్యాక్టరీ ఆవరణలో సోమవారం నెక్(నేషనల్ ఎగ్ కో–ఆర్డినేషన్ కమిటీ) ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. జేసీ, నెక్ నాయకులు రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక్క జిల్లాలో మాత్రమే బర్డ్‌ఫ్లూ ఉందని, మిగిలిన చోట్ల ఎక్కడ కూడా ఆ కేసులు లేవన్నారు. దీనిపై ప్రజలు భయపడాల్సిన పని లేదన్నారు.

మల్చింగ్‌తో నాణ్యమైన పంట

అన్నదాతలు పంట సాగులో వినూత్న విధానాలు అవలంభిస్తున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందే అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. అందులో భాగంగా మల్చింగ్ పద్ధతిలో వ్యవసాయం చేసేందుకు మొగ్గుచూపుతున్నారు. ఈ క్రమంలో ప్రతికూల వాతావరణంలోనూ పంటలను కాపాడుకుంటున్నారు. కలుపుతోపాటు చీడపీడల నుంచి రక్షణ పొందేలా చర్యలు తీసుకుంటున్నారు. నీటి అవసరాలను తగ్గించుకుంటూ అధిక దిగుబడి సాధిస్తున్నారు.

- చీడపీడల నుంచి రక్షణ
- తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి
- అధిక ఆదాయం పొందే అవకాశం



అన్నూరు వద్ద మల్చింగ్ పద్ధతిలో సాగు చేస్తున్న బొప్పాయి

కార్వేటినగరం: జీడీ నెల్లూరు నియోజకవర్గంలోని రైతులు మల్చింగ్ విధానంలో సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ మేరకు ఇప్పటికే దాదాపు 55 ఎకరాల్లో వినూత్న పద్ధతిని అమలు చేస్తున్నారు. తక్కువ నీటితో ఎక్కువ పంటను సాగు చేసి అధిక లాభాలు ఆర్జించడంపై దృష్టి సారిస్తున్నారు.

ప్లాస్టిక్ కవర్లతో కప్పేసి..

మొక్కల చుట్టూ ప్లాస్టిక్ కవర్లతో కప్పి ఉంచడాన్ని మల్చింగ్ విధానం అంటారు. ఇందులో 25 మైక్రాన్లు, 50 మైక్రాన్లు, 60 మైక్రాన్లు, 75 మైక్రాన్లు,100 మైక్రాన్ల ప్లాస్టిక్ షీట్లను మొక్కల బోదెలపై కప్పి ఉంచుతారు.

- పండ్ల తోటలకు 75 నుంచి 100 మైక్రాన్లు, పువ్వులు ఇతర స్వల్పకాలిక పంటలకు 25 నుంచి 50 మైక్రాన్ల షీట్లు వాడతారు.
- పొలంలో ప్రతి మల్చింగ్ కవర్‌కు నాలుగు అడుగుల దూరం ఉండేలా చూసుకోవాలి.
- డ్రిప్ ద్వారా మొక్కకు నీరు అందేలా కవర్‌కు చిన్న రంధ్రం ఏర్పాటు చేయాలి. విత్తనానికి విత్తనానికి మధ్య 60 సెంటీ మీటర్లు దూరం ఉండేలా విత్తుకోవాలి.
- ఒక్కసారి మల్చింగ్ కవర్ ఏర్పాటు చేసుకుంటే మూడు పర్యాయాలు అదే స్థలంలో విత్తనాలు విత్తుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.
- సంప్రదాయ పద్ధతితో పోల్చుకుంటే మల్చింగ్ షీట్ పరిచిన పొలంలో ఎరువులను మొక్కలు పూర్తిగా వినియోగించుకుంటాయి.
- మల్చింగ్ సాగులో కలుపు నివారణ మందులు చల్లడం, కలుపు తీయడం వంటి పనులు ఉండవు. దీంతో రైతులకు ఖర్చులు కలసి వస్తాయి.
- విధానంలో కలుపు బెడద ఉండదు. చీడపీడలు దరి చేరవని అధికారులు చెబుతున్నారు. నీటి వినియోగం కూడా తగ్గుతుందని వివరిస్తున్నారు.
- పుచ్చ, బొప్పాయి, టమాట, మిర్చి, జామ, కూరగాయల పంటలను మల్చింగ్ విధానంలో రైతులు పండిస్తున్నారు.

మంచి ఆదాయం వచ్చింది



ఉద్యాన శాఖ అధికారుల సూచన మేరకు మల్చింగ్ పద్ధతి ద్వారా గతంలో కూడా బొప్పాయి పంట వేశా. మంచి ఆదాయం వచ్చింది. ఇప్పుడు అదే విధానం పాటిస్తున్నా. బొప్పాయిలో తోటలోనే పామ్ సాగు చేస్తున్నా, ఈ ఏడాది కూడా చక్కటి లాభాలు వస్తాయని ఆశిస్తున్నా. –లోకనాథరెడ్డి, రైతు,అన్నూరు, కార్వేటినగరం మండలం

అన్నదాతకు లాభం

మల్చింగ్ వేసుకోవడం వల్ల నీరు ఆదా అవుతుంది. కలుపు మొక్కల నివారణ సులభతరమవుతుంది. దిగుబడి పెరిగి లాభాలు గడించే అవకాశముంటుంది.మెట్ట ప్రాంతాల్లో కూరగాయలు పండించే రైతులు మల్చింగ్ విధానంలో సాగు చేయడం మంచిది. –లోకేష్, ఉద్యానవన శాఖాధికారి, జీడీనెల్లూరు

5న జాబ్ మేళా

నగరి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్, అమెజాన్ వేర్ హౌస్ కంపెనీల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ వేర్ హౌస్ అసోసియేట్ ఉద్యోగాలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.వేణుగోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18–35 ఏళ్ల వారు 10వ తరగతి నుంచి డిగ్రీ పాస్‌గానీ, ఫెయిల్ గానీ అయిన నిరుద్యోగులు కళాశాల పూర్వ విద్యార్థులు ఈ ఉద్యోగాలకు అర్హులని చెప్పారు. ఈ జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు కంపెనీ హెచ్‌ఆర్ సేదు 96007 84605ను, కళాశాల జేకేసీ ఫుల్‌టైమ్ మెంటార్ లాల్ బాషాను 95731 04593ను సంప్రదించాలన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ లోకనాథపిళ్లై

శ్రీరంగరాజపురం: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా విధులు నిర్వర్తించాలని తహసీల్దార్ లోకనాథపిళ్లై ఆదేశించారు. సోమవారం మండల రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై మొత్తం 17 అర్జీలు వచ్చినట్లు వెల్లడించారు. ఆయా వినతులను క్షుణ్ణంగా పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించనున్నట్లు వివరించారు.

గాలికుంటు నివారణకు టీకాలు





నింద్ర: పశువులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది, విజయపురం: ఆదిఆంధ్రవాడలో టీకా వేస్తున్న డాక్టర్

విజయపురం: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్నట్లు మండల పశువైద్యాధికారి శివమూర్తి అన్నారు. విజయపురం, మహావీరపురం, చిన్న, పెద్ద మహావీరపురం గ్రామాల్లో పశువులకు ఆయన గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సూక్ష్మాతి సూక్ష్మ క్రిముల (వైరస్) వల్ల వస్తుందన్నారు. 24 గంటల్లోగా చిక్కిపోయి అల్సర్‌కు గురవుతాయని, రెండు నుంచి ఆరు రోజుల వరకు జ్వర తీవ్రత ఎక్కువగా ఉంటుందన్నారు. నోరు, పెదాలు, నాలుక, రొమ్ములతో పాటు కాళ్ల గిట్టల మధ్య పుండ్లు వచ్చి అనతికాలంలోనే ఈ వ్యాధి వ్యాపిస్తోందన్నారు. ఈ వ్యాధి సోకిన పశువులు ఎప్పుడూ ముడుచుకుని పడుకుంటాయని, మేత, నీళ్లు సరిగా తీసుకోలేవు, నెమరు వేయలేవు అని గుర్తు చేశారు. నోటి నుంచి సొంగ లేక నురగ కారుతుండడంతోపాటు బరువు తగ్గిపోతాయని, కాళ్ల మధ్యన పుండ్లు వలన సరిగ్గా నడవలేవని చెప్పారు. పాల ఉత్పత్తి తగ్గిపోవడమే కాకుండా వ్యాధి నిరోధక శక్తి తగ్గి కొన్ని సార్లు పశువులు (ఎక్కువగా దూడలు) చనిపోయే అవకాశం ఉంటుందన్నారు. వ్యాధి సోకిన దూడలు 30 నుంచి 40 శాతం చనిపోతుంటాయి. ముందస్తు నివారణలో భాగంగా టీకాలు వేయించుకోవడమే మంచిదన్నారు. వ్యాధి సోకిన పశువుల పాలను తాగడం వల్ల దూడలు చనిపోతాయని తెలిపారు. పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ లేదా నార్మల్ సైలెన్ నీటితో పరిశుభ్రంగా కడగాలన్నారు.

గాలి కుంటు నివారణ చర్యలు

నింద్ర: మండలంలోని పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ చర్యలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారి సంధ్య తెలిపారు. పలు గ్రామాల్లో సోమవారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఆమె మాట్లాడుతూ గాలి కుంటువ్యాధి నివారణకు తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు టీకాలు వేస్తున్నట్లు రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా పాడిఆవులకు పాల దిగుబడి తగ్గడం, జ్వరం, సొంగకారడం, కుంటడం వంటి లక్షణాలు కనిపిస్తే తక్షణం వైద్యసేవలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శస్త్ర చికిత్సలకు 20 మంది ఎంపిక



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

పాలసముద్రం: మండలంలోని శివప్రకాష్ రాజు కాంప్లెక్స్‌లో సోమవారం వాసన్ ఐ కేర్ హాస్పిటల్ వారు వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ శివ దత్త సాయి, గురు సుస్మిత మాట్లాడుతూ శిబిరంలో కంటి పరీక్షలతోపాటు, ఇతర వ్యాధులకు కూడా ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. అలాగే కంటి పొర శస్త్రచికిత్సలకు 20 మందిని ఎంపిక చేసినట్లు వివరించారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను మార్చొద్దని వినతి



ఎంపీడీఓతో మాట్లాడుతున్న గ్రామస్తులు

శ్రీరంగరాజపురం: ఉపాధి కల్పిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌ను మార్చవద్దని వెంకటాపురం పంచాయతీ వాసులు కోరారు. సోమవారం ఈ మేరకు ఎంపీడీఓకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ లోకేష్ అవినీతికి తావులేకుండా తమకు ఉపాధి పనులు కల్పిస్తున్నారన్నారు. అయితే కొందరు కూటమి నేతలు తాము అక్రమంగా బిల్లులు చేసుకునేందుకు లోకేష్ అడ్డుగా ఉన్నారని లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇటావల నిర్వహించిన సామాజిక తనిఖీలో సైతం ఒక్క ఆరోపణను కూడా నిరూపించలేకపోయారని వెల్లడించారు. పేదల పక్షాన నిలబడి నిజాయితీగా పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌ను మార్చవద్దని విన్నవించారు.


సేంద్రియ పంటలు ఆరోగ్యకరం



కూరగాయలను పరిశీలిస్తున్న ఎంఈఓలు విజయకుమార్, మనోజ్‌కుమార్

కార్వేటినగరం: సేంద్రియ విధానంలో సాగు చేసిన పంటలు ఆరోగ్యకరమని ఎంఈఓ విజయకుమార్ తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సేంద్రియ ఎరువులతో సాగు చేసిన కూరగాయల స్టాల్ ఏర్పాటు చేశారు. స్టాల్‌ను సందర్శించిన ఎంఈఓ మాట్లాడుతూ రసాయన ఎరువులతో సాగు చేసిన ఉత్పత్తులను భుజిస్తే అనారోగ్యం బారిన పడే ప్రమాదముంటుందని హెచ్చరించారు. ప్రకృతి వ్యవసయా ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయుల, అంగన్‌వాడీ వర్కర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని తమ పాఠశాలల ఆవరణలో కూరగాయల సాగు చేపట్టి, మధ్యాహ్న భోజనంలో పిల్లలకు వండి వడ్డించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 మనోజ్‌కుమార్, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ రేఖ పాల్గొన్నారు.

గ్రావెల్ తవ్వకాలను అడ్డుకోండి



ఎస్‌బీఆర్‌పురం గుట్ట నుంచి గ్రావెల్ తవ్వేసిన దృశ్యం



నందయ్య

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలం, ఎస్‌బీఆర్‌పురం చెరువు కట్ట ఆనుకుని ఉన్న గుట్ట పోరంబోకు నుంచి అక్రమంగా గ్రావెల్ తవ్వకాలను అడ్డుకోవాలని ఎస్సీ, ఎస్టీ సంఘం జిల్లా కార్యదర్శి నందయ్య కోరారు. మూడు రోజులుగా ఎస్‌బీఆర్ పురం, అంబేడ్కర్ కాలనీ ఎదురుగా ఉన్న గుట్ట నుంచి అధికార పార్టీకి చెందిన నాయకుడు అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నాడని సోమవారం ఆయన మీడియాకు వివరించారు. రోజుకు వందల సంఖ్యలో గ్రావెల్ తరలివెళ్లిపోతుంటే ఎవరూ పట్టించుకోలేదని, జిల్లా, మండలస్థాయి అధికారులకు సమాచారం ఇచ్చినా అడ్డుకోలేకపోయారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్ట పగలే దోపిడీ చేస్తుంటే అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి, అక్రమ గ్రావెల్ తవ్వకాలను అడ్డుకోవాలని ఆయన కోరారు.

అర్ధరాత్రి ఇసుక అక్రమ రవాణా

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి నేతల ఇసుక దందాకు తెరలేపుతున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని కొల్లగొడుతున్నారు. చీకటి వేళ టిప్పర్లకు రైట్ రైట్ చెబుతున్నారు. ఇలా పక్క రాష్ట్రాలకు ఇసుక తరలిస్తూ, లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. తవణంపల్లె మండలం మైనగుండ్లపల్లిలో ఇసుక దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. చీకటి పడితే బహుదానదిలో అక్రమార్కులు రాజ్యమేలుతున్నారు. కూటమి నేతలు గ్రూపుగా ఏర్పడి ఈ దందాకు తెరలేపుతున్నారు. దర్జాగా జేసీబీలతో ఇసుక తవ్వకాలు చేసుకుంటున్నారు. రోజూ పదుల సంఖ్యల్లో టిప్పర్ల ఇసుక తరలుతోంది. పక్కరాష్ట్రాలకు అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఒక టిప్పర్ రూ.లక్ష వరకు అమ్ముకుంటున్నారు. ఈ అక్రమ వ్యాపారాన్ని అడ్డుకుంటారని పలువురు నాయకులు అక్కడే తిష్ట వేస్తున్నారు. ఎవరైనా అడ్డొస్తే బెదిరింపులకు గురి చేస్తున్నారు. ఇలా రాత్రి 7 గంటల నుంచి వేకువజామున 4 గంటల వరకు ఈ అక్రమ తవ్వకాలు, రవాణా జోరుగా సాగుతున్నాయి.

అడవికి నిప్పు



పుత్తూరు పట్టణం ఆర్‌డియం థియేటర్ సమీపంలోని అడవికి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి నిప్పు పెట్టారు. మంటలు అడవిలోకి విస్తరిస్తున్నాయి. దీంతో కొండకు సమీపంలో నివాసముంటున్న ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. –విజయపురం

ప్రభుత్వ పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో విద్యార్థులు, అధ్యాపకులు

పుత్తూరు: మండలంలోని పిల్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపల్ ఎస్‌వి కుమార్ ఆధ్వర్యంలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి కిషోర్ కుమార్, అధ్యాపకుల బృందం సారథ్యంలో మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. సోమవారం నిర్వహించిన ఈ సమ్మేళనంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ 2008 నుంచి 2021 వరకు పాలిటెక్నిక్ చదువుకున్న మెకానికల్ విద్యార్థులు కొత్త కళాశాల వేదికగా కలుసుకున్నారని చెప్పారు. నగరి డిగ్రీ కళాశాలలో సరిపడా తరగతి గదులు లేక మధ్యాహ్నం నుంచి తరగతి గదులు నిర్వహించినట్లు గుర్తుచేసుకున్నారు. బెంచీలు లేని సమయంలో మన కళాశాలలో పనిచేస్తున్న సీనియర్ ఇన్‌స్ట్రక్టర్లు విరాళంగా బెంచీలు తయారు చేసి ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఏటా నిర్వాహించాలని ఆకాంక్షించారు. వక్తలు మాట్లాడుతూ కళాశాల పిల్లారిపట్టులో ఏర్పాటు చేయడానికి కృషిచేసిన అధ్యాపకులు భార్గవ్, కిషోర్ కుమార్‌ను కొనియాడారు. పూర్వ విద్యార్థులు అప్పటి అనుభవాలను గుర్తుచేసుకుంటూ అధ్యాపకులను సన్మానించి జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వివిధ కళాశాల నుంచి అధ్యాపకులు కె.వేణుగోపాల్, యస్ యమ్ ముత్తుకుమార్, శరత్, రాఘవేంద్ర బాబు, హరిప్రసాద్, వేలాయుధచారి, సుగుణ, ఏఓ హనుమంతరావు పాల్గొన్నారు.

వచ్చీ రాని వైద్యం.. ప్రాణంతో చెలగాటం

- అన్ని వ్యాధులకు ఒకే విధమైన చికిత్స
- డెంగీ, మలేరియా, టైఫాయిడ్‌కు సొంత వైద్యం
- అమాయక ప్రజలను మోసం చేస్తున్న ఆర్‌ఎంపీ

వడమాలపేట (విజయపురం): కొందరు రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్లు (ఆర్‌ఎంపీలు) వచ్చీ రాని వైద్యం చేసి రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. తద్వారా వైద్యవృత్తికే మచ్చ తెస్తున్నారు. ప్రథమ చికిత్స చేయాల్సిన ఆర్‌ఎంపీల్లో కొందరు డాక్టర్ల అవతారమెత్తి ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని అడ్డంగా దోచుకుంటున్నారు. అనుమతి లేకుండా ఎక్కడపడితే అక్కడ ఇష్టారాజ్యంగా క్లినిక్‌లను నిర్వహించి వైద్యం అందిస్తున్నారు. స్థాయిని మించి అందిస్తున్న మందులు, చికిత్సల వల్ల రోగులు ఇబ్బందుల పాలవుతున్నారు. ఆర్‌ఎంపీలు ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో ప్రథమ చికిత్స మాత్రమే చేయాల్సి ఉంది. జ్వరం వస్తే మాత్రలు మాత్రమే ఇవ్వాలి. రోగి పరిస్థితి మరీ బాగాలేకపోతే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలని సూచించాలి. ఆస్పత్రికి రోగిని తరలించేలోగా పరిస్థితిని అదుపులో ఉంచడానికి ప్రాథమిక వైద్యం అదికూడా నిబంధనలకు లోబడి చేయాలి. కట్టు కట్టడం, సెలైన్లు ఎక్కించడం, ఇంజక్షను వేయడం వంటివి చేయకూడదు. గర్భిణులు, బాలింతలు. చిన్న పిల్లలకు చికిత్స అందించకూడదు. మధుమేహం, రక్త పరీక్షలతోపాటు స్కానింగ్ తీసుకోవాలని రోగులకు ఎలాంటి సిఫారసు చేయకూడదు. అయితే వీటన్నిటికి విరుద్ధంగా వడమాలపేట మండలం ఎస్‌బీఆర్ పురం వద్ద ఓ ఆర్‌ఎంపీ డాక్టరు వైద్యం అందిస్తున్నాడు. ఆరోగ్యం బాగాలేదంటే ఏకంగా సెలైన్లలో ఇంజక్షన్ వేసి రోగికి అందిస్తున్నారు. సొంతంగా మందులు, మాత్రలు అందిస్తున్నారు. అమాయక ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారు. పేదలను దోచుకోవడమే లక్ష్యంగా వైద్య సేవలు అందిస్తున్నారు. వడమాలపేట మండలంలో ఆర్‌ఎంపీ డాక్టర్ వైద్యం వికటించి ఓ వ్యక్తికి కాలు తీసివేయవల్సిన పరిస్థితి వచ్చిందని ఇటీవల జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీ, సర్పంచ్‌లు మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అయిన ఆర్‌ఎంపీ క్లినిక్ నిర్వహిస్తున్న వారు మాత్రం పద్ధతి మార్చుకోలేదు. మండలంలో మొత్తం 22 పంచాయతీలు ఉండగా అందులో 10కి పైగా ఆర్‌ఎంపీలు ఉన్నారు. కొంత మంది యూనియన్ నాయకులు ఇచ్చే ఐడీ కార్డులతో ఆర్‌ఎంపీలుగా చలామణి అవుతున్నారు. ఈ సర్టిఫికెట్ ఉంటే ఈజీగా డబ్బులు సంపాదించవచ్చన్న ఉద్దేశంతో ఆ సర్టిఫికెట్‌కు ఎంతైనా ఖర్చు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఆర్‌ఎంపీ క్లినిక్‌లో రోగికి సెలైన్లు ఎక్కిస్తున్న దృశ్యం